క్లుప్తంగా

ఆహార పదార్థాల తయారీలో నాణ్యత ముఖ్యం



అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఫుడ్ సేఫ్టీ కమిషనర్ శ్రీనివాసరావు

బాలాజీచెరువు: ఆహార పదార్థాల తయారీలో నాణ్యత ప్రమాణాలు ముఖ్యమని అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) ఆధ్వర్యంలో కాకినాడ, పెద్దాపురం డివిజన్‌కు సంబంధించి బ్యాకరీ, రిటైలర్లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఫుడ్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆహార పదార్థాలు విక్రయించేవారు ప్రతి ఒక్కరూ ఎస్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వర్సిటీ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుబ్బారావు, సిబ్బంది బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ఓటర్ల సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఈఆర్వో సీహెచ్ నాగనరసింహారావు బీఎల్‌ఓలను ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని 233 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంతవరకు జరిగిన సర్వే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఏఈఆర్‌వోలు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు

కాకినాడ సిటీ: మోదీ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలపై, దేశ ప్రజలను విడదీసి మతోన్మాదంపై పోరాడే స్వాతంత్రోద్యమ అమర వీరులకు మనమిచ్చే ఘన నివాళి అవుతుందని సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక ఉత్సవాల్లో జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ భవన్‌లో నిర్వహించిన స్వాతంత్రోద్యమ సాంస్కృతిక ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. నాయకులు జి బేబీ రాణి, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో విజయవాడ

కాకినాడ సిటీ: విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు, కాంట్రాక్ట్ కార్మికులంతా గురువారం చలో విజయవాడ తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు.

రెండు వార్డులకు ఐదుగురు

సామర్లకోట: మండల పరిధిలో చంద్రంపాలెంలో 4వ వార్డుకు తలారి వెంకట సుబ్బారావు, తోట మణికంఠ, వేట్లపాలెంలో 14వ వార్డుకు కాకాడ రవిశేఖర్, బత్తిన ఏసుబాబు, బొబ్బరాడ రాజు పోటీలో ఉన్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పవర గ్రామంలోని 5వ వార్డుకు కేవలం ఒక నామినేషన్ మాత్రమే దాఖలు కావడంత కోట లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. ఈనెల 19న చంద్రంపాలెం, వేట్లపాలెం వార్డులకు ఎన్నిక జరుగుతుందని ఎండీఓ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని రెండు గంటల తరువాత కౌంటింగ్ ప్రారంభం అవుతుందన్నారు.

జోరుగా మాంసం విక్రయాలు

సామర్లకోట: స్వాతంత్య్ర దినోత్సవ వేళ పట్టణ పరిధిలో యథాతథంగా మాంసాహార విక్రయాలు జరిగాయి. రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఈ విక్రయాలు యథేచ్ఛగా సాగినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అలాగే సత్యనారాయణపురం రోడ్డులో మద్యం విక్రయాలు సైతం విరివిగా సాగాయి.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకం

సామర్లకోట: మార్చి 2017 నుంచి ఏప్రిల్ 2023 వరకు 10వ తరగతిలో మొదటి నాలుగు స్థానాలు సాధించిన విద్యార్థులకు యార్లగడ్డ అక్కిరాజుపేరన భార్య యార్లగడ్డ సుబ్బలక్ష్మి స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రూ.70వేలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, పారిశ్రామిక వేత్త గ్రంధి వెంకటేశ్వరరావు, దాత యార్లగడ్డ సుబ్బలక్ష్మి, పాఠశాల హెచ్ఎం యు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాకినాడ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆర్మీ దళం కవాతు..



మొదటి బహుమతి గెలుచుకున్న విద్యాశాఖ శకటం



జన్మభూమి పార్కులో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



కరప హైస్కూలులో జెండా వందనం చేస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం



కలెక్టరేట్ ఆధునీకరణ పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ



సర్పవరం జంక్షన్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



జిల్లా పరిషత్ ఆవరణలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



నడకుదురు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మొక్క నాటుతున్న కర్నాసుల



కరప మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జెండా వందనం

కాకినాడ సిటీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కృతికా శుక్లా మీట నొక్కి వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కలెక్టరేట్‌లోని గాంధీజీ విగ్రహానికి కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, డీఆర్వో శ్రీధర్‌రెడ్డి నివాళులర్పించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన అమర వీరుల త్యాగాలు మరువలేనివన్నారు. కలెక్టరేట్ ఆధునీకరణ పనులను కలెక్టర్, జేసీ, డీఆర్వో ప్రారంభించారు. జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జెండా వందనం చేశారు. ఉద్యోగులకు దుస్తులు అందజేశారు. విద్యార్థులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ డి.పుష్పమణి, వికాస పీడీ కె లచ్చారావు, సీపీఓ త్రినాథ్ పాల్గొన్నారు. ఏపీ ఎన్‌జీవో భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షులు గుద్దటి రామమోహన్‌రావు జాతీయ జెండాను ఎగురవేశారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రదర్శించిన శకటాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. వీటిలో జిల్లా విద్య, సమగ్ర శిక్ష శకటానికి మొదటి బహుమతి, జిల్లా పౌరసరఫరాల శాఖ శకటానికి రెండో బహుమతి, జిల్లా పశుసంవర్ధకశాఖ శకటానికి మూడో బహుమతి లభించాయి. వీటికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, హర్‌ఘర్ తిరంగా, జాతీయ స్ఫూర్తిని చాటుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

పోలీస్ సేవా పతకాలు

డాక్టర్ ప్రేమ్‌కాజల్, ఎస్‌కే అబ్దుల్ నబీ, సీహెచ్ చిదంబరకుమార్, ఎ.సత్యనారాయణ, జె రామారావు, జె.రామస్వామి, జి.బలరామూర్తి, సీకే సూరన్న పోలీస్ సేవా పతకాలు అందుకున్నారు.

ఉత్తమ కవాతు: జిల్లా 18 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆర్మీ వింగ్‌కు మొదటి బహుమతి, 3 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఆర్మీ వింగ్‌కు రెండో బహుమతి, నావెల్ యూనిట్‌కు తృతీయ బహుమతి లభించాయి.

ఉత్తమ స్టాల్స్: మహిళాభివృద్ధి శిశు సంక్షేమం (మొదటి బహుమతి), వ్యవసాయం (ద్వితీయ బహుమతి), ఏపీఎంఐపీ,ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ (తృతీయ బహుమతి) సాధించాయి.

కరపలో..

కరప: మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీ వద్ద ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప హైస్కూలు, మండల విద్యా వనరుల కేంద్రం వద్ద జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ఎస్.రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. వేళంగి పీహెచ్‌సీలో డాక్టర్ ఎంకే సౌజన్య, నడకుదురులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, నడకుదురు ఏడీఏ కార్యాలయంలో సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు జాతీయ జెండాలను ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, అడబాల సత్య, చింతా నాగలక్ష్మి, రెడ్డిపల్లి వెంకటమాధవి, కొత్త నాగలక్ష్మి, పలివెల నాగేశ్వరరావు, సవిలే నీలిమ, వాసంశెట్టి కొండ, నున్న సుజాత, మార్శెట్టి శ్రీనివాస్, వి.రాఘవ, బిరుదా సరస్వతి, నాగిరెడ్డి ఏసుబాబు, నక్కా బాబులు, బొమ్మిడి నయోమి, అనసూరి శ్రీనివాస్, దేగల లలితకుమారి, వాసంశెట్టి శ్రీనుబాబు, వాసంశెట్టి రామారావులు, నాగిరెడ్డి ఏసుబాబు జాతీయ జెండాలను ఎగురవేశారు. జి.భావారంలో మండల సర్పంచ్ రొక్కాల గణేష్, పెద్దాపుర్పాడు పాఠశాలలో పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టి.వెంకట్రావు, నడకుదురులోని వేర్ హౌస్ గోదాంల ఆవరణలో మేనేజర్ బి.సత్యనారాయణ, విశ్రాంత జీఎం ప్రసాదనాయుడు జెండా ఎగురవేశారు. వివిధ గ్రామాల్లో వైస్ ఎంపీపీలు పాట్నీడి భీమేశ్వరరావు, బొమ్మిడి వీర్రాఘవులు, ఎంపీడీఓ కె.అప్పారావు, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఈఓ పీఆర్డీ పి.శ్రీనివాస్, ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఉపాధి ఏపీఓ ఈవీ రమణ, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మండలంలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు.

పంచాయతీ సిబ్బంది, కార్మికులకు సత్కారం

కరప పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ వైఎస్సార్‌సీపీ నాయకుడు సాదే లోహిదాస్ తదితరులు సత్కరించారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఉత్తమ సేవలు అందించిన 45 మంది ఉద్యోగులకు కమిషనర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎస్‌ఈ పి.సత్య కుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

పలు కార్యాలయాల్లో..

కేసీబీఎస్‌లో సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్ర కుమార్ జాతీయ పతాకం ఎదురు వేశారు. కస్టమ్స్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వీరవెంకటరెడ్డి, కస్టమ్స్ డివిజన్ పరిధిలో సూపరింటెండెంట్ సీహెచ్ సతీష్‌సింగ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వర రావు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్మిక సంఘాలు, వివిధ కార్యాలయాల్లో, వినాయక డీప్ వాటర్ పోర్టు వర్కర్స్ ఆధ్వర్యంలో, లారీ వర్కర్స్ యూనియన్, లక్ష్మీ డీప్ వాటర్ పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వీరభద్రారెడ్డి పాల్గొన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యలయం కళావెంకట్రావు భవనంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు, ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి రాంబాబు, పీసీసీ సభ్యులు ఆకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలో..

కాకినాడ రూరల్: రమణయ్యపేట క్యాంపు కార్యాలయంతో పాటు సర్పవరం జంక్షన్‌లో ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురార్జీ, వసపాకల పంచాయతీ వద్ద జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గుడా కార్యాలయంలో రాగిరెడ్డి చంద్రకళాదీప్తి జెండా వందనం చేశారు. వీసీ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు. సెట్రాజ్ కార్యాలయంలో సీఈఓ శ్రీరమణి, గైగోలుపాడులో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరు జమ్మలమడక నాగమణి, ఇంద్రపాలెంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో కమాండెంట్ సీహెచ్ విజయరావు జాతీయ జెండాలను ఎగరవేశారు.

వివిధ కార్యాలయాల్లో

బోట్‌క్లబ్: స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ ఆర్ విక్టర్, జిల్లా సహకారశాఖ కార్యాలయంలో జిల్లా సహకార అధికారి బీవీఎస్ దుర్గాప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఎస్‌ఈ ఎం.శ్రీనివాస్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వెదురుపాక సతీష్, సాలిపేట మున్సిపల్ స్కూల్‌లో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు జాతీయ పతాకాలను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. విడోస్ హోమ్ సంస్థ ద్వారా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

న్యాయస్థానాల ప్రాంగణంలో..

కాకినాడ లీగల్: న్యాయస్థానాల ప్రాంగణంలో మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, జిల్లా వినియోగదారుల ఫోరం ప్రాంగణంలో అధ్యక్షుడు చెరుకురి రఘుపతి వసంత కుమార్, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ ముత్తింటి విశ్వేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్, స్పెషల్ సబ్‌జైలులో సూపరింటెండెంట్ ఎం.వీరబాబు జాతీయ పతాకాలను ఎగరవేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కాకినాడ కల్చరల్: స్థానిక శ్రీనగర్‌లోని జన్మభూమి పార్కు ఆవరణలో శ్రీసూర్య నృత్యనికేతన్ నాట్యాచారిణి ఎం.మహాలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. గణప్రార్థన, కాలభైరవాష్టకం,అన్నమయ్య కీర్తనలు, దేశభక్తి గీతాలకు అనుగుణంగా వారు నృత్యం చేశారు. అలాగే 150 మంది గృహిణులు కోలాటం, సీనియర్ బాలికలతో కర్ర సాము ప్రదర్శించారు.

ఉత్తమ సేవా పురస్కారాలు

కాకినాడ/కాకినాడ లీగల్/కరప/కాకినాడ సిటీ/బోట్‌క్లబ్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ కృతికా శుక్లా అవార్డులు ప్రదానం చేశారు. నగరపాలక సంస్థకు సంబంధించి కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో పాటు, కార్పొరేషన్ ఎస్‌ఈ పి.సత్య కుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, శానిటరీ ఇన్స్పెక్టర్ లాజర్, మరో ముగ్గురు సచివాలయ కార్యదర్శులు ఉన్నారు. కాకినాడ మూడో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీ సత్తి గంగాదేవికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఉత్తమ ఆరోగ్యమిత్రగా వంచెర్ల వీరభద్రరావులకు ఉత్తమ పురస్కారాలు లభించాయి . అలాగే జిల్లా ఐఅండ్‌పీఆర్ సహాయ పౌరసంబంధాల అధికారి (ఏపీఆర్‌వో) కొలుపూరి రవి, ఫొటోగ్రాఫర్ సీహెచ్ నరేష్, దంత వైద్యుడు, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ ఉత్తమ పురస్కారం అందుకున్నారు.







జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికాశుక్లా నుంచి అవార్డు తీసుకుంటున్న ఏపీపీ గంగాదేవి, ఏడీఏ బాబూరావు, ఐఅండ్‌పీఆర్ ఏడీపీఆర్వో రవి, ఫొటోగ్రాఫర్ నరేష్, దంత వైద్యుడు డాక్టర్ అద్దాల సత్యనారాయణ



జాతీయ జెండాను ఎగురవేసి మహాత్ములకు నివాళులర్పిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు



జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ విక్టర్..



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న దేవదాయ శాఖ డీసీఎం విజయరాజు



ఏపీఎస్పీ బెటాలియన్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కమాండెంట్ విజయరావు



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి తదితరులు

పలకరింపులు.. పులకరింతలు



పాఠాలు చెప్పిన గురువులతో గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఒరేయ్.. మనతో చదివిన పైండావోడు ఈడేనా.. అరే వచ్చే వాడు ప్రవీణ్‌గాడేనా ఎంత మారిపోయాడురా.. చూడవే ఉమ అప్పటికీ ఇప్పటికీ ఒకలాగే ఉంది.. నువ్వు రమాదేవివే కదూ.. అంటూ పూర్వ విద్యార్థులు ఒకరినొకరు గుర్తుపట్టుకునే ప్రయత్నం చేశారు. సుమారు మూడున్నర దశాబ్దాల అనంతరం వారు చదువుకున్న పాఠశాలలో మళ్లీ కలుసుకుని పలకరింపులతో నాటి సంగతులతో పులకించిపోయారు. జగన్నాథపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల 1987–88 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం కలుసుకుని చిన్నపిల్లలైపోయారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న వారంతా కలసి సందడి చేశారు. అనంతరం గురువులను సత్కరించి గ్రూప్ ఫొటో దిగారు. తమ కలయికకు కారకులైన పూర్వ విద్యార్థులు కోరుమిల్లి శ్రీనివాస్, గెడ్డం ప్రవీణ్‌కుమార్, మోకా ఉమ, రమాదేవి, రుద్రి వీర్రాఘవులు, పంతాడి త్రిమూర్తులను సహచర విద్యార్థులు అభినందించారు.

పడిన శ్రమ మర్చిపోయా



నాడు చదువుకున్న పూర్వ విద్యార్థుల నంబర్లు కష్టపడి సేకరించి, గ్రూపు ఏర్పాటు చేశాను. వారందరిని ఒకే చోటకు చేర్చేందుకు తాపత్రయపడ్డాను. స్నేహితులు, ఉపాధ్యాయులు అందరూ ఒకే చోట తిరిగి కలుసుకునేందుకు పడ్డ శ్రమను అందరినీ చూసిన తర్వాత మర్చిపోయా.

– కోరుమిల్లి శ్రీనివాస్, పూర్వ విద్యార్థి, కాకినాడ

ఎంతో ఆరాటపడ్డా



పాత మిత్రులను కలవడం చాలా సంతోషంగా ఉంది. కేవలం స్నేహితులను కలుసుకోవడానికి అమెరికా నుంచి వచ్చాను. ఉపాధ్యాయులను కూడా చూసిన ఆనందంతో తిరిగి వెళ్తున్నాను.

– మోకా ఉమాశంకర్, న్యూహేంప్ షైర్, బోస్టన్, అమెరికా

ఉక్కిరిబిక్కిరయ్యా



మిత్రులందరినీ కలుసుకున్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరికి లోనయ్యాను. నాటి స్నేహితుల్లో చాలా మందిని ఒకే చోటకు చేర్చగలిగిన మిత్రులకు కృతజ్ఞతలు. తక్కువ సమయంలో అందరినీ ఒకే వేదికపైకి తీసుకుని వచ్చారు.

– ఎం. ఉమ, ఎంఈవో, తాళ్లరేవు మండలం

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం



మేమంతా తిరిగి విద్యార్థులుగా మారిపోయాం. వచ్చిన స్నేహితులంతా గుండెల నిండా సంతోషాన్ని నింపుకుని వెళ్లారు. పూర్వ విద్యార్థులంతా కలసి భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి కృషి చేసేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తాం.

–గెడ్డం ప్రవీణ్‌కుమార్, పూర్వ విద్యార్థి, ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్, అమలాపురం